క్లుప్తంగా

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి



పెద్దమల్లెల పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేంద్ర

రొంపిచెర్ల: పాఠశాలల పునఃప్రారంభమయ్యే లోపు నాడు–నేడు పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేంద్ర అన్నారు. బుధవారం రొంపిచెర్ల, పెద్దమల్లెల పంచాయతీల్లో నాడు–నేడు పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభమయ్యే లోగా విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, షూలు పాఠశాలలకే చేరినట్లు పేర్కొన్నారు. సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు కిషోర్, కిరణ్‌కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నీళ్లకుంటలో ఘనంగా జాతర



ప్రత్యేక పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని నీళ్లకుంటలో మంగళవారం జాతర ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వార్డు కౌన్సిలర్ శ్రీలక్ష్మి రాజేష్, గంగమ్మ ఆలయ చైర్మన్ కండల నరేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖఃసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు.మాజీ కౌన్సిలర్ శాంతమ్మ, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

చౌడేపల్లె: రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి పవన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. బీమా పథకం కింద సంకరజాతి ఆవులు, గేదెలు, ఎద్దు మరణిస్తే రూ.30 వేలు, దేశవాళీ ఆవు మరణిస్తే రూ.15 వేలు, గొర్రెలు, మేకలు మరణిస్తే రూ.6 వేలు చొప్పున నష్టపరిహారం పొందవచ్చునని సూచించారు.

10న శ్రీవేంకటేశ్వర కల్యాణం

రామకుప్పం: మండలంలోని విజలాపురం మురుగేష్ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీలక్ష్మీ పద్మావతీదేవీ, శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఉన్సిగానిపల్లె తిమ్మ రాయస్వామి, చౌడేశ్వరీ దేవస్థానం ఆలయ ధర్మకర్త గుర్రప్ప శెట్టి తెలిపారు. టీడీడీ వేదపండితులచే వేదపా రాయణం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రూ.కోటికి పైగా వ్యాపారంతో రికార్డు

తవణంపల్లె: చేయూత మహిళా మార్ట్ వ్యాపారాల విస్తరణకు సంఘ సభ్యులు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి అన్నారు. బుధవారం తవణంపల్లెలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తులసి మాట్లాడారు. తవణంపల్లె సంఘ సభ్యుల సహకారంతో చేయూత మహిళా మార్ట్‌లో తక్కువ రోజుల్లోనే కోటి రూపాయలకు పైగా వ్యాపారం చేసి రికార్డు సృష్టించారని అభినందించారు. ఇదే స్ఫూర్తితో తక్కువ ధరలకు నాణ్యమైన సరకులను విక్రయించి, వ్యాపారపరంగా ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య లీడర్లు, సంఘ మిత్రలు, సంఘ సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీడి రవి, ఐబీ డీపీడి వెంకటేష్, చేయూత డీపీఎం రవి, ఏపీఎం సీసీలు, మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులందరికీ జలప్రసాదం



జలప్రసాద కేంద్రం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ

కాణిపాకం (యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యం జలప్రసాదం ఇవ్వనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆలయ పరిసరాలలో నాలుగు చోట్ల రూ.64.50లక్షలతో జలప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటిని ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఉదయం ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. ఎమ్మెల్యే జలప్రసాదాన్ని సేవించారు. స్వామివారి తీర్థంలా ఉందని ఆయన పేర్కొన్నారు. జలప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రైవేటు కంపెనీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. బుధవారం మం డలంలోని శివునికుప్పం సచివాలయ పరిధిలోని శివునికుప్పం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా..? ఏవైనా సమస్యలున్నాయా అని తెలుసుకున్నారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేసి పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన కొనసాగుతుందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలను ఇళ్ల ముందుకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. గత టీడీపీ పాలనలో అన్ని అర్హతలు ఉన్నా పథకాల కోసం ప్రజలు కాళ్లు అరిగేలా తిరిగినా లబ్ధి అందేది కాదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కేవలం ఎన్నికల కోసమే హామీలను గుప్పిస్తారని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆహామీలను గాలికి వదిలేయడం ఆయన నైజమని ప్రజలు గుర్తించారని తెలిపారు. ప్రస్తుతం అదే కోవలో మ్యానిఫ్యాస్టోను విడుదల చేసి ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నట్లు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చి ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు విన్నవించిన సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం

కొంగాటం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని సర్పంచ్ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆర్‌బీకే ద్వారా విత్తనాలు, మందులు, ఎరువులు స్థానికంగా లభిస్తాయని, అధికారులు అందుబాటులో ఉంటూ అన్ని సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఎంపీపీ యువరాజు, సర్పంచ్ అనితారెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, కృష్ణమూర్తి, ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కమల్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డిచే పలు ప్రారంభోత్సవాలు



మండల కార్యాలయం వద్ద మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి, నాగభూషణం

పుంగనూరు: రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం పుంగనూరును పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రూ.2.60 కోట్లతో నూతనంగా నిర్మించిన మండల కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ పట్టణంలోని శాంతినగర్‌లో విద్యుత్‌లైన్లు మార్పిడి కార్యక్రమం పనులను మంత్రి ప్రారంభించ నున్నారని పేర్కొన్నారు. రాగానిపల్లె రోడ్డు, తూర్పుమొగశాలలో రూ.1.60 కోట్లతో నిర్మించిన రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నరసింహులు, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి నూతన మండల కార్యాలయ భవనాన్ని పరిశీలించి ఏర్పాట్లపై సూచనలు చేశారు.

వెటర్నరీ కళాశాల భవనానికి భూమిపూజ

సదుం: మండలంలో గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. ఎర్రాతివారిపల్లె మార్గంలో రూ.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేస్తారని తెలిపారు. జాంద్రపేట వద్ద నూతనంగా నిర్మించిన వంతెనపై లైటింగ్ సిస్టం ప్రారంభిస్తారని చెప్పారు. పార్టీశ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పటాలమ్మ తల్లీ.. పాహిమాం



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అశేష భక్తజనం

పెద్దపంజాణి: రాయలపేట గ్రామంలో శ్రీపటాలమ్మ గంగజాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజామున మండపంలో అమ్మవారు కొలువుదీరగా భక్తులు అశేషంగా తరలి వచ్చి దర్శించుకున్నారు. పరిసర గ్రామాల ప్రజలు, పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి శిరస్సు మెరవణి మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని మారెమ్మ ఆలయం నుంచి ప్రారంభమైంది. మంగళ వాయిద్యాల నడుమ బజారు వీధి మీదుగా సాగి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని కొలువుదీర్చారు. ఊరేగింపులో ప్రతి ఇంటి వద్ద అమ్మవారి శిరస్సుకు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాణసంచా, సౌండ్ లైటింగ్, విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబలి సమర్పణ...

అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన అంబలి సమర్పణకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన పెద్ద డ్రమ్ములో భక్తులు ఇంటి నుంచి తీసుకువచ్చిన అంబలిని పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అంబలిని ప్రసాదంగా ఇళ్లకు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీబాబు, అంజమ్మ, సింగిల్‌విండో చైర్మెన్ ఓబుల్‌రెడ్డి, మాజీ చైర్మెన్ శంకరప్ప, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, జిల్లా కార్యదర్శులు తమ్మరెడ్డి, సుహేల్, మాకయ్య, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

నేడు నిమజ్జనం...

రెండు రోజులపాటు నిర్వహించిన గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో పరిసమాప్తం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం అనంతరం మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా వేడుకలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ శివారులోని బావిలో నిమజ్జనం చేయనున్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పలమనేరు: అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. పట్టణంలని సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురురాజారావు, సంఘ నేతలు కృష్ణమూర్తి, గౌస్, వినాయకం, గురుస్వామి నాయుడు, బాలసుబ్రమణ్యం, శైలజాకుమారి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ చెల్లించాలి

ప్రభుత్వ పెన్షనర్లకు ప్రతి నెల ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించాలని స్థానిక పెన్షనర్ల సంఘం నాయకుడు మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆసంఘ సమావేశం స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ, డీఏ బకాయిలను సైతం ఒకే దఫా చెల్లించాలని కోరారు. సంఘ నాయకులు రత్నారెడ్డి, గురుమూర్తి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఈశ్వరయ్య, అమాస మోహన్

సోమల: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ముగ్గురికి పంపిణీ చేశారు.ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు మాట్లాడుతూ నంజంపేటకు చెందిన నగేష్ బాబుకు రూ.1.15 లక్షలు, కోటేశ్వరరావుకి రూ.65 వేలు, నెల్లిమంద పంచాయతీ ఎగువపల్లెకు చెందిన అమాస రామకృష్ణయ్యకు రూ.1.40 లక్షలు అందినట్లు వివరించారు. వైస్ ఎంపీపీ ప్రభాకర, నంజంపేట సర్పంచ్ వెంకటరెడ్డి, వాటర్‌షెడ్ వైస్ చైర్మన్ పీఎల్ఆర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

రాయితీ పశుగ్రాస విత్తనాల పంపిణీ



చౌడేపల్లె: పశుగ్రాస విత్తనాలను 75 శాతం రాయితీ ధరతో రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్య కేంద్రంలో పాడి రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కిలో రూ:17 చొప్పున 5 కేజీల బ్యాగ్ రూ.85 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. పశుగ్రాసం కొరతను నివారించేందుకు ప్రభుత్వం రాయితీ ధరకు విత్తనాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. అవసరమైన రైతులు పాసుపుస్తం, ఆధార్ కార్డు తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిత్తూరు అర్బన్ : బంగారుపాళ్యం మండలంలో బుధవారం ఎస్ఈబీ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో వెంకటాచలపతి నాయుడు (65) అనే వ్యక్తి నుంచి 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

రైతు బజార్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి

పలమనేరు: పలమనేరు పట్టణంలో రైతు బజార్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకమండలి కృషి చేస్తోందని ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మెన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ సమీపంలో ఇంటిగ్రేటెడ్ టమాటా మార్కెట్‌కు 33 ఎకరాల భూ కేటాయింపులకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వీకోట మండలంలోని శివుని కుప్పం మ్యాంగో మార్కెట్, రాయల పేట మార్కెట్ ప్రహరీగోడ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలో రైతుబజార్ ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. స్థానికంగా వాణిజ్య సముదాయ నిర్మాణం తదితరాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి సంజీవకుమార్, ఉపాధ్యక్షులు పుష్పలత ఆంజనేయులు, కమిటీ సభ్యులు, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

వి.కోట: ప్రభుత్వానికి..ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ సారథులని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప కొనియాడారు. బుధవారం మండలం ప్రజాపరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివన్నారు. వైఎస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప సర్పంచ్‌లు బాలకృష్ణ గౌడు, వెంకటటేష్, దేవేంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

గుడుపల్లె : ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుడుపల్లె, చిన్నగొల్లపల్లె ఆర్‌బీకేలను సందర్శించారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఖరీఫ్‌లో రైతులు పంటలు వేసేందుకు ముందు ప్రభుత్వ పథకాలు ఎప్పటికప్పుడు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని తెలిపారు. సస్యరక్షణ చర్యలు క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. అనంతరం కాడేపల్లెలోని మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులు సంఘాలుగా ఏర్పడి మిల్లెట్ ప్రాసెసింగ్ వంటి చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏవో నాగరాజు, ఆర్‌బీకే అధికారులు పాల్గొన్నారు.